# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 27-02-2016**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో ప్రభుత్వం తలపెట్టిన లక్ష ఇండ్ల నిర్మాణం కార్యక్రమ అమలు పురోగతిపై ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సమీక్ష జరిపారు. ఈ మేరకు శనివారం నాడు క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌తో చర్చించారు. సమీక్షలో సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. నర్సింగ్ రావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి శాంతికుమారి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన పురోగతిని వివరించిన కలెక్టర్ ఇప్పటివరకు అందిన దరఖాస్తుల వివరాలు, సేకరించిన ఖాళీ స్థలాల గురించి చెప్పారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 4,740 చొప్పున డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించేందుకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

"నివాసయోగ్యమైన చక్కటి స్థలాలను గుర్తించండి. టవర్లను అందంగా నిర్మించండి. ఎవరైనా చూస్తే ఇవి గరీబోల్ల ఇండ్లు కావు... ధనికులవి అని అనేటట్లు ఉండాలే'' అని సిఎం చెప్పారు. గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద ప్రజలకు విశ్వాసం ఏర్పడడమే అందుకు కారణమని సిఎం అన్నారు. కులం, మతం అనే బేధం లేకుండా ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇళ్ళు కట్టించి ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఎంపిక బాధ్యత రెవిన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాలను గుర్తించేందుకు స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని సూచించారు.

"గత ప్రభుత్వాల విధానాలకు మా ప్రభుత్వానికి చాలా తేడా వుంది. పేదలకు లబ్ధి చేకూరే విషయంలో రాజకీయాలకు తావివ్వం'' అని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికను అత్యంత పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నగరం నడిబొడ్డున వున్న మురికివాడలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా 'ఎక్కడి వారికి అక్కడే' అనే విధానంలో డబుల్ బెడ్ రూంల నిర్మాణం సాగాలన్నారు. ఇటీవల నిర్మించి ఇచ్చిన ఐడిహెచ్ కాలనీ తరహాలో భవిష్యత్ నిర్మాణాలుండాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**